


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




బుధవారం 1 జూలై 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2

## రైతు సంక్షేమమే కాంగ్రేస్ ప్రభుత్వ సంకల్పం







భానుపురి/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని మొదటి విడత గా రెండు ఎకరాల లోపు రైతులకు దాదాపు 44 లక్షల 37 వేల మంది రైతులకి పంట పెట్టుబడి సాయంగా సుమారు 2482 కోట్ల రూపాయలను రైతు బరోసా ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాదులోని శిల్పకళా వేదికలో విడుదల చేశారు. ఎకరానికి రూ.12 వేల చొప్పున, మొత్తం 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి సాయంతో వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

## నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

భానుపురి/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీ సంజయ్ జాజు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలోని బోధి పెవిలియన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి సలహాదారుగా, సీఎం ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన కే . రామకృష్ణ రావు కూడా పాల్గొన్నారు.ఈ భేటీలో రాష్ట్ర పరిపాలన, బాధ్యతల బదిలీ తదితర అంశాలపై స్వల్పంగా చర్చ జరిగినట్లు సమాచారం.

## "తులం బంగారం ఊసేలేదు.. హామీలు అమలు చేయాలి"



భానుపురి/ సూర్యాపేట టౌన్

ఇచ్చిన హామీలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ఇచ్చిన లక్ష రూపాయలు తప్ప తులం బంగారం ఊసే లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేర్చాలి" అని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.2500, స్కూటీలు ఇవ్వాలి. ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఆసరా పెన్షన్ మీరు చెప్పినట్లుగా రూ.4000లకు పెంచి ఇవ్వాలి" అని అన్నారు. నిరుద్యోగ భృతి, ఇస్తామన్న ఉద్యోగాలు సకాలంలో ఇవ్వాలి. హామీలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల గురించి మహిళల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది" అని జగదీష్ రెడ్డి విమర్శించారు. కల్యాణ లక్ష్మి పథకం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైందని, పేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం






భానుపురి/చివ్వేంల

నేరాల నియంత్రణ, కేసులు ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. మంగళవారం చివ్వేంల మండలం వట్టి ఖమ్మంపహాడ్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రిచ వచ్చున్నారు. చివ్వేంల పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని, గ్రామాల్లో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత అసాంఘీక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. వారిని సక్రమమైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. మహిళలకు, బాలికలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే డయల్ 100, షీటీమ్‌కు సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు,నాయకులు పాల్గొన్నారు.

## సూర్యాపేటలో దీర్ఘకాలిక మురికి కాలువకు మోక్షం





-కొత్తబస్టాండ్ సమీప ప్రాంత ప్రజల హర్షం.

భానుపురి /సూర్యాపేట టౌన్

గత కొన్ని సంవత్సరాలుగా వర్షం వస్తే చాలు చెరువును తలపిస్తూ.. కాలువల్లో నీరు పోక మురికినీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసనకు గురవుతున్న కొత్త బస్టాండ్ వద్ద తిరిగే ప్రజలకు, వ్యాపారస్తులకు, ప్రయాణికులకు నేటితో విముక్తి కలిగింది. మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్ష్యాది అదేశాలమేరకు మున్సిపల్ సిబ్బంది జెసిబి,మున్సిపల్ ట్రాక్టర్ లతో కాలువలో పేరుకుపోయిన చెత్త, మురికినీరును తొలగించారు. బస్టాండ్ వాసుల కోరికమేరకు సుదీర్ఘ కాలంగా అమలుకు నోచుకోని మురికికాలువ పూడికను తీయించిన ఘనత సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది కే దక్కుతుందని కొత్తబస్టాండ్ సమీప ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పది ఏండ్లుగా పరిష్కార కాని సమస్య నేటికి పరిష్కారం కావడంతో ప్రజలు,వ్యాపారస్తులు హర్షము వ్యక్తం చేశారు.

## షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి





భానుపురి/ సూర్యాపేట కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు అందించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పేదింటి మహిళలు సద్వినియోగపరుచుకోవాలని సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), చివ్వేంల, పెన్ పహాడ్, సూర్యాపేట అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని వీటిని ప్రతి ఒక్క పేదింటి మహిళ సద్వినియోగపరుచుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి, గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

భానుపురి /సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



శాంతి భద్రతల పరిరక్షణ దృశ్య, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొనసాగించడానికి జూలై ఒకటి వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించరాదని మరియు సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలను ఉసిగొలిపేటువంటి ఆయుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలకు తప్పవు అని సూచించారు. నిబంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చేసుకొని అనుమతులను పొందాలని సూచించారు.

# విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

-బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ లింగయ్య యాదవ్

భానుపురి /సూర్యాపేట టౌన్



రాష్ట్రంలో విద్యారంగం అనేక సమస్యలతో కునారిల్లుతోందనీ బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ఇంటర్మీడియట్ డిగ్రీ ఇంజనీరింగ్ నర్సింగ్ ఫార్మసీ తదితర కళాశాల బంద్ చేసి అనంతరం మీడియా సమావేశంలో లింగయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలురూ. 8000 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పై చదువులు, ఉద్యోగాలకు వెళ్లలేక పోతున్నారు. ప్రభుత్వ, కళాశాలల్లో సరైన భవనాలు, టాయిలెట్స్, తాగునీరు, లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలు లేవు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయకపోవడంతో పరిశోధనలు ఆగిపోయాయి. అధ్యాపకులకు జీతాలు కూడా సరిగా ఇవ్వడం లేదు. పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వారం రోజుల్లో విడుదల చేయాలి. ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక వసతులు కల్పించాలి. విద్యారంగానికి బడ్జెట్ లో కేటాయింపులు పెంచాలి. యూనివర్సిటీలకు స్వయంప్రతిపత్తి కల్పించి నిధులు విడుదల చేయాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం మాని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించాలి. లేనిపక్షంలో విద్యార్థి, తల్లిదండ్రులు, సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రాజబోయిన సుమన్ , ప్రధాన కార్యదర్శి పరాల సాయి , బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి సతీష్ , మంద శివ కుమార్, లోకేష్, గణేష్, విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి బంద్ ను విజయవంతం చేయడం జరిగింది.

# ఓబిసీ సూర్యాపేట జిల్లా అబ్జర్వర్ గా బయ్యు దేవేందర్ యాదవ్

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేట జిల్లా ఓబీసీ విభాగం అబ్జర్వర్ గా పిసిసి ఓబిసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బయ్యు దేవేందర్ యాదవ్ మంగళవారం నియమితులయ్యారు.
తనపై నమ్మకంతో తన నియామకానికి కృషి చేసిన టిపిసిసి ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, టిపిసిసి ఓబీసీ కన్వీనర్ డాక్టర్ కేతూరి వెంకటేశ్వర్లు, టిపిసిసి ఓబీసీ కన్వీనర్ జూలరి ధనలక్ష్మి, నా నియమకానికి సహాయ సహకారాలు అందించిన భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసీల సమస్యల పరిష్కారంతోపాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# పల్స్ పోలియో సిబ్బందికి సుమన్ మెడికల్ ఆధ్వర్యంలో బిర్యాని ప్యాకెట్లు పంపిణీ

భానుపురి/సూర్యాపేట టౌన్



పల్స్ పోలియో సిబ్బందికి ఏరియా ఆసుపత్రిలో మంగళవారం సుమన్ మెడికల్ ఆధ్వర్యంలో ఉచితంగా బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంహెచ్వో డాక్టర్ పెండెం వెంకటరమణ హాజరయ్యారు . ఈ సందర్భంగా డిఎంహెచ్వో పెండెం వెంకటరమణ మాట్లాడుతూ పల్స్ పోలియో నిర్వహిస్తున్న సిబ్బందికి సుమన్ మెడికల్ నిర్వాకులు యామ ప్రభాకర్ బిర్యాని ప్యాకెట్లు అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు యామ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ వైద్య ,ఆరోగ్యశాఖ సిబ్బంది పాత్ర ఎంతో అమూల్యమైందని తెలిపారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో పల్స్ పోలియో నిర్వహిస్తున్న సిబ్బందికి ఉచితంగా బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. సేవా కార్యక్రమంలో తను ముందుంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రవణ్ కుమార్, ఆర్ ఎం ఓ లు జనార్ధన్, ఉపేందర్ నాయక్, డాక్టర్ గీత వాణి, డాక్టర్ సంధ్య సూర్యాపేట పట్టణ ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముశం హరిప్రసాద్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రెటరీ గుండా శ్రీనివాస్ , ఆరోగ్య మిత్ర రమణ నర్సింగ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# 42వ వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం



భానుపురి/సూర్యాపేట టౌన్

42వ వార్డులో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై గౌరవ 42వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రుద్రంగి రవి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వార్డులో ఉన్న మురుగు కాలువల సమస్యలు, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాల మరమ్మతులు, పందుల సంచార సమస్య పారిశుద్ధ్య సమస్యలు తదితర అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని, వార్డు అభివృద్ధే తమ లక్ష్యమని రుద్రంగి రవి తెలిపారు. ఈ కార్యక్రమం లో వార్డ్ నాయకులు గుండెపూరి జానయ్య, మామిడి సుధాకర్,, కొత్తపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు...

# బీసీ స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

భానుపురి/ సూర్యాపేట టౌన్



బీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ చారి డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ పిలుపు మేరకు సూర్యాపేటలో కళాశాలల బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రూ. 8,500 కోట్ల బకాయిలను విడుదల చేసి ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకు అర్హులైన ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌ను మరింత ఉద్ధృతం చేసి ఐదు లక్షల మంది విద్యార్థులతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి సాయి తేజ, కల్లూరు అభి, రిషి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ సమస్యను పరిష్కరించాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గత మూడు రోజులుగా నెలకొన్న సర్వర్ ప్రాబ్లం సమస్యను రాష్ట్ర ప్రభుత్వశీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు,పంతంగి వీరస్వామి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రం నుండి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యం రిజిస్ట్రేషన్ , కొరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వర్ ప్రాబ్లం ఉండటంవల్ల ప్రజలకు రిజిస్ట్రేషన్ లతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం లేదన్నారు. గత మూడు రోజులుగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్ ప్రాబ్లం ఉండటం వల్ల ప్రజలు వందలాదిమంది నిరీక్షించాల్సి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సిబ్బంది కొరత కూడా ఉన్నది తాగేందుకు మంచినీరు, కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో పాటు వర్షాకాలంలో వర్షం లోనే తడవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు .ప్రభుత్వం స్పందించి నూతన రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మంజూరు చేసి నిర్మించడంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా గత మూడు రోజులుగా సర్వర్ ప్రాబ్లం చేత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వేలాదిమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే సర్వర్ ప్రాబ్లం ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి కారణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెంటనే అధికారులు స్పందించి సర్వర్ ప్రాబ్లం రాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే సిబ్బందిని పెంచాలని విజ్ఞప్తి చేశారు.